క్లుప్తంగా

లార్డ్స్ విద్యార్థుల సత్తా



పతకాలు, సర్టిఫికెట్లతో విద్యార్థులు

బడంగ్‌పేట్: ఇటీవల దేశవ్యాప్తంగా హ్యాండ్ రైటింగ్ పోటీలు నిర్వహించగా బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని మల్లాపూర్ లార్డ్స్ టాలెంట్ హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. వెండి, రజత పతకాలతో పాటు ప్రశంసా పత్రాలను అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ సిద్దాల బీరప్ప మంగళవారం విద్యార్థులను అభినందించారు. బ్రహ్మరాతను మార్చే శక్తి చేతిరాతకుందని అన్నారు. మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బి.శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు శ్రీరాధ, అనురాధ, ప్రిన్సిపాల్ కొండల్‌రావు, అడ్మిన్ ఇన్‌చార్జి శేఖర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు

తొలగించాలని డీఈఈకి వినతి

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని సర్దార్ నగర్ గ్రామంలో విద్యుత్ శాఖ అధికారులు గృహాలకు విద్యుత్ సరఫరా చేసే పాత స్తంభాలను తీసి కొత్త స్తంభాలను పాత స్థలంలో నాటకుండా ప్రజలు రోడ్ల మధ్యలో నాటారని మంగళవారం ఆగ్రామ మాజీ సర్పంచ్ తాళ్ల రాకేష్‌గౌడ్ తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రంలో ఆశాఖ డీఈఈని కలిసి ఫిర్యాదు చేశారు. వెంటనే సమస్య పరిష్కరించాలని కోరారు.

అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

సర్పంచ్ కలమ్మరాజు


సీమంతాలు నిర్వహిస్తున్న సర్పంచ్ కలమ్మ, ఎంపీటీసీ పద్మ

కందుకూరు: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆకులమైలారం సర్పంచ్ గొరిగె కలమ్మరాజు, ఎంపీటీసీ పద్మపాండు సూచించారు. మంగళవారం మండలంలోని ఆకులమైలారం పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అంగన్‌వాడీల్లో అందించే పౌష్టికాహారాన్ని తల్లులు, గర్భిణులు, చిన్నారులు ఉపయోగించుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. తమ పిల్లలను అంగన్‌వాడీల్లో చేర్పించి లబ్ధిపొందాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాంరెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మీ, వనజ, పుష్పలత, సంతోష పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని వెంకటాపూర్ గ్రామ మాజీ ఉపసర్పంచ్ కుంట మల్లారెడ్డి సతీమణి కుంట రాధమ్మ అనారోగ్యంతో మంగళవారం తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న మహేశ్వరం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, బడంగ్‌పేట్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగురింత నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ బొర్ర మాధవరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ పోరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ దండు గణేష్‌ముదిరాజ్, జెనిగె శ్రీనివాస్ యాదవ్ తదితరులు విచ్చేసి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు.

పెద్దమ్మతల్లికి మారుబోనం


పెద్దమ్మతల్లికి మారుబోనం సమర్పిస్తున్న భక్తులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని మాదన్నగూడ గరిగుట్ట పెద్దమ్మ తల్లి జాతర ఉత్సవాలు మంగళవారం మారుబోనంతో ముగిశాయి. ఈనెల 11 నుంచి 13 వరకు అంగరంగ వైభవంగా గరిగుట్ట జాతర కల్యాణ మహోత్సవాలు జరిగిన విషయం విదితమే. మంగళవాకం ఆలయ ధర్మకర్త కరన్ కోట్ విఠల్ బాబా, మాజీ ఎంపీటీసీ దూడల శ్రీనివాస్ గౌడ్‌లు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి మారుబోనం సమర్పించారు.

ఆర్థికసాయం అందజేత

కందుకూరు: కందుకూరు చౌరస్తాలో నివసిస్తున్న పేద కుటుంబానికి చెందిన సరాబు వీరేశం రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో మంగళవారం స్థానిక వార్డు సభ్యుడు సొడవు వెంకటేష్‌గౌడ్ అతని కుటుంబానికి ఆర్థిక సహాయం కింద రూ.5 వేల నగదుతో పాటు 25 కిలోల బియ్యం అందించి మానవత్వాన్ని చాటుకున్నాడు. ఆయన వెంట స్థానిక యువకులు రాజశేఖర్‌రెడ్డి, సురేందర్, పైయూ, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

‘విస్తరణ’ పూర్తయ్యేనా?

- రెండున్నరేళ్లుగా కొనసాగుతున్న పులిమామిడి–మహేశ్వరం రోడ్డు పనులు
- అవస్థలు పడుతున్న వాహనదారులు, ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు


కంకరపోసి వదిలేసిన పులిమాడి–మహేశ్వరం రోడ్డు

కందుకూరు: ఇక్కడ నిర్మిస్తున్న రహదారి పనులు నత్తే నయం అనేలా కొనసాగుతున్నాయి. విస్తరణ పనులు చేపట్టి రెండేళ్లకు పైగా గడుస్తుంది. ఇంకా పనులు ఓ కొలిక్కి రాలేదు. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రోడ్డు తవ్వి ఉండటం కారణంగా తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. అయినా సంబంధిత అధికారులు మాత్రం తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇది మండల పరిధిలోని పులిమామిడి–మహేశ్వరం మధ్య ఉన్న ప్రధాన రహదారి సమస్య.

కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం..

మండల పరిధిలోని పులిమామిడి నుంచి మహేశ్వరం మధ్యలో ఉన్న 8 కిలోమీటర్ల రహదారి విస్తరణ పనులు పీఎంజీఎస్‌వై నిధులు రూ.5.13 కోట్లతో మంత్రి సబితారెడ్డి చేతుల మీదుగా 2020 సెప్టెంబర్ 12న శంకుస్థాపన చేశారు. 3.75 మీటర్ల రహదారిని 5.5 మీటర్ల మేర విస్తరణ పనులు చేపట్టారు. అయితే టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులను తన ఇష్టమొచ్చినప్పుడు చేయిస్తున్నాడు. దీంతో కొన్ని ప్రాంతాల్లో రోడ్డును తవ్వి కంకర నింపి వదిలేయడం, మరికొన్నిచోట్ల రోడ్డు పక్కన వెడల్పులో భాగంగా తవ్వి పనులు ఆపడంతో ఇబ్బందికరంగా మారింది పరిస్థితి. మరోపక్క మధ్యలో ఉన్న చిన్న కల్వర్టులను విస్తరించకుండానే రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. దీంతో నిత్యం ఆ మార్గం నుంచి ప్రయాణించే వాహనదారులకు తిప్పలు తప్పడంలేదు. తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఎన్నిమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే వారే లేరని స్థానికులు వాపోతున్నారు. కంకర పోసి వదిలేయడంతో దుమ్ము, ధూళి అధికమై ప్రయాణం నరకంగా మారింది. రోడ్డు పక్కన ప్రమాదకరంగా తవ్వి నెలలు తరబడి వదిలేయడంతో ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించడం సాధ్యం కాక ద్విచక్ర వాహనదారులు కిందపడి గాయాలపాలవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తాం

మేయర్ దుర్గ

మీర్‌పేట: మున్సిపాలిటీలోని కాలనీల్లో మౌలిక వసతులు కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని మీర్‌పేట కార్పొరేషన్ మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్ తెలిపారు. మంగళవారం 1వ డివిజన్ పరిధిలోని కాలనీలో డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డితో కలిసి మేయర్ పర్యటించారు. అంతర్గత రోడ్లను అభివృద్ధి చేయడంతో పాటు పారిశుద్ధ్య నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అదే విధంగా స్థానికంగా ఉండే ఓపెన్ జిమ్‌కు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, బహిరంగంగా చెత్త వేయకుండా కాలనీవాసులకు అవగాహన కల్పించాలని, స్థానికంగా ఉన్న గ్రంథాలయంలో ప్రజలకు ఉపయోగపడే పుస్తకాలు అందుబాటులో ఉండేలా చూడాలి అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, డీఈ గోపీనాథ్, ఏఈ శ్రీనివాసులు, స్థానిక నాయకులు రమేష్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, వెంకటేష్, కాలనీల అధ్యక్షులు పాల్గొన్నారు.


కాలనీవాసులతో మేయర్ దుర్గ, డిప్యూటీ మేయర్ విక్రంరెడ్డి

ఖదీర్‌ది ముమ్మాటికి ప్రభుత్వ హత్యే

- అతడి కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం చెల్లించాలి
- బీజేపీ నేత అందెల శ్రీరాములు


నష్టపరిహారం చెల్లించాలని ప్లకార్డులు ప్రదర్శిస్తున్న బీజేపీ నాయకులు

బడంగ్‌పేట్: పోలీస్ దెబ్బలకు ఇటీవల చనిపోయిన ఖదీర్ కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు రూ.50 లక్షల నష్టపరిహారం చెల్లించాలని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జల్‌పల్లి మున్సిపాలిటీ మైనార్టీ నాయకులు ఖాజాపాషాతో నాదర్‌గుల్‌లోని పార్టీ కార్యాలయంలో అందెల మాట్లాడారు. అమాయకుడైన ఖదీర్‌ను రాత్రికిరాత్రే మెదక్ పోలీసులు పాత బస్తీ నుంచి తీసుకెళ్లి తీవ్రంగా కొట్టారన్నారు. అయితే అనంతరం నేరం చేసింది ఖదీర్ కాదని తెలుసుకుని తర్వాత వదిలివేశారని గుర్తు చేశారు. అయితే పోలీసుల దెబ్బలను తట్టుకోలేక ఆస్పత్రి పాలైన ఖదీర్ చనిపోయాడన్నారు. ఇది ముమ్మాటికి ప్రభుత్వ హత్యేనన్నారు. పోలీసులను సస్పెండ్ చేసినంత మాత్రాన చనిపోయిన ఖదీర్ కుటుంబానికి న్యాయం జరుగుతుందా అని ప్రశ్నించారు. పోలీసుల అమానుష ప్రవర్తనతో రోడ్డున పడ్డ ఖదీర్ కుటుంబానికి రూ.50 లక్షల నష్టపరిహారంతో పాటు వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని పేద కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేవైఎం అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి తదితరులున్నారు.

ఆలయంలో షూటింగ్

భక్తులకు ఇబ్బందులు

మీర్‌పేట: సినిమా షూటింగ్‌తో ఆలయానికి వచ్చిన భక్తులు ఇబ్బందులు పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు.. మీర్‌పేట జిల్లెలగూడలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం ఆవరణలో మంగళవారం సినిమా షూటింగ్ జరిగింది. ఆలయానికి రూ.10వేలు చెల్లించి అనుమతి తీసుకున్న నిర్వాహకులు షూటింగ్ చేసే సమయంలో ఆలయ ప్రధాన గేటుకు తాళం వేశారు. దీంతో ఆలయానికి వచ్చిన భక్తులు కొంతసేపు బయటే వేచివున్నారు. ఉదయమే దర్శనం కోసం వచ్చిన భక్తులకు ఆలయ సిబ్బంది, అర్చకులు కూడా అందుబాటులో లేకపోవడంతో కొంతసేపు వరకు వేచి చూడాల్సి వచ్చింది. షూటింగ్ కారణంతో ప్రధాన ద్వారానికి తాళం వేయడంపై భక్తులు అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఆలయ ఈఓ శ్రీనివాస్‌రెడ్డిని వివరణ కోరగా.. గేటుకు తాళం వేసిన విషయం తన దృష్టికి రాలేదని, భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగలేదని, రోజువారి పూజా కార్యక్రమాలు యధావిధిగా జరిగాయని తెలిపారు.

ప్రశ్నిస్తే దాడులా..?

ఎన్ఎస్‌యూఐ జిల్లా నాయకుడు ఫరీద్

ఆమనగల్లు: ప్రభుత్వ తప్పులు ఎత్తి చూపినా.. ఎమ్మెల్యేల అవినీతిని ప్రశ్నిస్తే దాడులు చేస్తారా..? అని ఎన్ఎస్‌యూఐ జిల్లా నాయకుడు ఎండీ ఫరీద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ తన అనుచరులతో మంగళవారం యువజన కాంగ్రెస్ నాయకుడు తోట పవన్‌పై దాడి చేయించడం హేయనీయమన్నారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ నాయకులు నల్ల మాస్కులు ధరించి మౌన పోరాటం చేశారు. అనంతరం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. అంతకు ముందు వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం నియంతపాలన సాగిస్తతోందని ఆరోపించారు. ప్రశ్నించేవారిపై దాడులు చేస్తే ప్రజల తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు మహేశ్, ఈశ్వర్, మల్లేశ్, లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి చేయూత

ఆమనగల్లు: పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన మేదరి యాదమ్మ ఇంటి నిర్మాణానికి రజకసంఘం నాయకుడు నాగిళ్ల జగన్ చేయూతనందించాడు. యాదమ్మ ఇంటి నిర్మాణానికి నాగిళ్ల జగన్‌ను కలిసి యాదమ్మ సాయం కోరగా వెంటనే గృహ నిర్మాణానికి అవసరమైన మెటీరియల్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు శివకుమార్, మహేశ్, బాలు, శ్రీను పాల్గొన్నారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ భక్తులకు కొంగు బంగారంలాగా మారింది. అమ్మవారికి ఇష్టమైనరోజు మంగళవారం కావడం చేత భక్తులు ఉదయం నుంచే ఆలయంలో క్యూలో ఉండి ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు, కానుకలు చెల్లించుకున్నారు. ఆలయంలో సామూహిక సత్యానారాయణ వత్రాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ ఆలయ ఫౌండర్ ట్రస్టీ, చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, సిబ్బంది కాశీనాథ్, పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహ స్వామికి పల్లకీ సేవ

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని జిన్నాయి గుట్ట శ్రీలక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో మంగళవారం అమావాస్య పల్లకీ సేవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి దంపతులు విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి ఆలయ మాఢ వీధుల్లో ఊరేగించారు. భక్తులకు నక్షత్ర హారతి దర్శనం కల్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ ఆలయ చైర్మన్ శివశంకర్, పూజారులు అజయ్‌శర్మ, మురళీశర్మ, పాలకమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారు

బీజేపీ రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ సుధాకర్‌శర్మ


సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్‌శర్మ

మీర్‌పేట: బంగారు తెలంగాణ పేరుతో రాష్ట్రాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పుల పాలు చేసిందని బీజేపీ రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ సుధాకర్‌శర్మ ఆరోపించారు. సోమవారం రాత్రి మీర్‌పేట కార్పొరేషన్ పరిధి బీజేపీ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన శక్తి కేంద్రం కార్నర్ సమావేశానికి సుధాకర్‌శర్మ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేద ప్రజల కోసం ఆయుష్మాన్‌భారత్‌తో ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనలో రూ.4 లక్షల 33 వేల కోట్ల అప్పులు చేసింది తప్ప చేసిన అభివృద్ధి ఏమీలేదన్నారు. శివారు మున్సిపాలిటీల్లోని వీకర్ సెక్షన్‌లలో జీహెచ్ఎంసీ కంటే అధికంగా ఇంటి పన్నులు, నల్లా బిల్లులు వసూలు చేస్తూ ప్రజలపై అదనపు భారం వేస్తున్నారని, వెంటనే వీటిని రద్దు చేయాలని లేకపోతే పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలు గాజుల మధు, సోమేశ్వర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో అధ్యక్షుడు పెంద్యాల నర్సింహ, బూత్ అధ్యక్షుడు వి.శ్రీకాంత్, దామోదర్‌రెడ్డి, నాయకులు ప్రభాకర్, చెవ్వ శ్రావణ్, బుచ్చిరాములు, రాజశేఖర్, విక్కీసాగర్ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో బాలుడి మృతి బాధాకరం

కార్పొరేటర్ శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: వైఫల్యాలను కప్పి పుచ్చుకోవడానికి ప్రభుత్వం ఆరాటపడుతోందని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్ అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీవాణి మాట్లాడుతూ.. అంబర్‌పేటలో వీధికుక్కల దాడిలో బాలుడు చనిపోవడం బాధాకరమని, మున్సిపల్ శాఖా మంత్రి కేటీఆర్, జీహెచ్ఎంసీ వైఫల్యంతోనే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని ఆరోపించారు. కుక్కకాటుకు బాలుడు మరణిస్తే కేవలం వచ్చి సారీ అని తమాషా చేయటం వారి చేతగాని తనానికి నిదర్శనమని అన్నారు. ప్రజాప్రతినిధులైన మేము విన్నపాలు చేస్తేనే పట్టించుకోని మేయర్ ఈరోజు 4 సంవత్సరాల బాబు మరణించిన తర్వాత మీడియా సమావేశంలో అందరి అభిప్రాయాలు తీసుకోవడానికి రెడీ అని మాట్లాడటం విడ్డూరంగా ఉందని అన్నారు. వైఫల్యాలను కప్పి పుచ్చుకోవడానికి మొసలి కన్నీరు కారుస్తున్నారని, ఇటువంటి సంఘటనలు జరిగినప్పుడే మీకు సమస్యలు గుర్తుకు వస్తాయా అని ఆమె ప్రశ్నించారు.

సీఐటీయూ మండల కన్వీనర్‌గా బాల్‌రాజ్


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

కందుకూరు: సీఐటీయూ మండల కన్వీనర్‌గా మండల కేంద్రానికి చెందిన బుట్టి బాల్‌రాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం సీఐటీయూ నాయకులు సమావేశమై కమిటీని ప్రకటించారు. సభ్యులుగా పంచాయతీ విభాగం నుంచి కారోబార్ బాల్‌రాజ్‌గౌడ్, రాములు, సురేష్, యాదయ్య, బొర్ర యాదమ్మ, చెన్నమ్మ, అంగన్‌వాడీ విభాగం నుంచి సుమతి, సరస్వతి, రాణి, ఆశా విభాగం నుంచి జయసుధ, వెంకటమ్మ, లక్ష్మీదేవి, సరస్వతి, మధ్యాహ్న భోజన విభాగం నుంచి కాల్యాణ్‌కార్ శ్రీను, కిషన్‌జీ, గీత, కలమ్మ, ప్రభావతి, ఎలక్ట్రీషియన్ రంగం నుంచి గాదె సత్తయ్య, గాదె కుమార్, కొమ్మగల్ల కుమార్, హమాలీ రంగం నుంచి క్రిష్ణ, రాములు, చెన్నయ్యను ఎన్నుకున్నామన్నారు. కాగా అంతకుముందు పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీ నుంచి మండల పరిధిలోని తిమ్మాపూర్, లేమూరు, సరస్వతిగూడల్లో చేపట్టనున్న పాదయాత్రను విజయవంతం చేయాలని కోరుతూ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ కవిత, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాంచందర్, సీపీఎం మండల కార్యదర్శి శ్రీనివాస్, శేఖర్, బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యం


యువకులకు కాంగ్రెస్ కండువాలు కప్పుతున్న నర్సింహారెడ్డి

మేయర్ చిగురింత పారిజాత

బడంగ్‌పేట్: మేయర్ చిగురింత పారిజాత సమక్షంలో పలువురు యువకులు మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని అన్నపూర్ణనగర్ కాలనీ, బాలాజీనగర్ కాలనీలకు చెందిన పలువురు యువకులు బాలాపూర్‌లోని పార్టీ కార్యాలయంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగురింత పారిజాత సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. పార్టీ బలోపేతం కోసం కష్టపడి పనిచేయాలని తగిన గుర్తింపు ఇస్తామని మేయర్ వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగురింత నర్సింహారెడ్డి, పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి ఉన్నారు. పార్టీలో చేరినవారిలో వర్ధన్ రెడ్డి, పృధ్వీ, నితీష్‌కుమార్, సతీష్ ఉన్నారు.

ప్రజలకు అండగా ‘ఐక్యత’

ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: కల్వకుర్తి నియోజక వర్గ ప్రజలకు ఐక్యత ఫౌండేషన్ అండగా ఉంటుందని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. ప్రజలకు విద్య, వైద్యంతో పాటు ఉపాధి కల్పించడమే ధ్యేయమని ఆయన చెప్పారు. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండలో ఐక్యత ఫౌండేషన్ కార్యలయం ప్రారంభోత్సవం సందర్భంగా ఆమనగల్లులోని ఐక్యత ఫౌండేషన్ కార్యాలయం నుంచి చేపట్టిన ర్యాలీని మంగళవారం ఆయన ప్రారంభించారు. అంతకుముందు నిర్వహించిన సమావేశంలో రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పేద ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా ఐక్యత ఫౌండేషన్ ఏర్పాటు చేశామన్నారు. ప్రజలకు విద్య, వైద్యం అందించేందుకు ఫౌండేషన్ తరఫున పలు కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వరప్రసాద్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రచ్చ శ్రీరాములు, ఫౌండేషన్ సభ్యులు చంద్రశేఖర్, సత్యం, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.


ఆమనగల్లు పట్టణంలో ఐక్యతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

రైతుబీమాతో అన్నదాతలకు ధీమా


ఇబ్రహీంపట్నం రూరల్: కప్పపహాడ్ గ్రామస్తుల సమస్యలు తెలుసుకుంటున్న ప్రశాంత్‌కుమార్‌రెడ్డి


ఇబ్రహీంపట్నం: తుర్కగూడలో ప్రశాంత్‌రెడ్డికి గజమాలతో స్వాగతం పలుకుతున్న గులాబీ శ్రేణులు

- మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్ రెడ్డి
- 400 కిలోమీటర్లు పూర్తైన ప్రగతినివేదన పాదయాత్ర

ఇబ్రహీంపట్నం రూరల్: రైతు బీమా అన్నదాతలకు కొండంత ధీమాగా మారిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్ రెడ్డి అన్నారు. 31 రోజులుగా కొనసాగుతున్న పాదయాత్ర మంగవారంతో 54గ్రామాల్లో 410 కిలోమీటర్లు పూర్తయింది. ఈ సందర్భంగా ఆయనకు కప్పపహాడ్ గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. గ్రామంలో వృద్ధులు, దివ్యాంగులను కలుస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. సీఎం కేసీఆర్ ఆదేశాలతో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన పనులను ప్రజలకు వివరించేందుకు ఈ పాదయాత్ర నిర్వహిస్తున్నామన్నారు. కప్పపహాడ్ గ్రామానికి ఎనిమిదేళ్లలో రూ.7.38 కోట్ల నిధులు కేటాయించి అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. గ్రామంలో అభివృద్ధి పనులకు రూ.5.80 లక్షలు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కృపేశ్, డీసీసీబీ వైస్ చైర్మన్ సత్తయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, పీఏసీఎస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బుగ్గ రాములు, సర్పంచ్ హంసమ్మ, ఉప సర్పంచ్ మునీర్, ఎంపీటీసీ సభ్యుడు భరత్ రెడ్డి, నాయకులు సతీశ్, శివ, మల్లారెడ్డి, నిట్టు జగదీశ్వర్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

తుర్కగూడలో ఘన స్వాగతం

ఇబ్రహీంపట్నం: బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తనయుడు చేపట్టిన ప్రగతి నివేదన పాదయాత్ర 400 కిలోమీటర్లు దాటి సోమవారం రాత్రి తుర్కగూడ గ్రామానికి చేరుకుంది. ఎంపీపీ కృపేశ్, సర్పంచ్ కత్తుల పవిత్రకుమార్, ఎంపీటీసీల మండల ఫోరం అధ్యక్షుడు ఏనుగు భరత్‌రెడ్డి, ఉపసర్పంచ్ నరేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బుచ్చిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు చిలుక బుగ్గరాములు, మంద సురేశ్‌లు గజమాల వేసి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి స్వాగతం పలికారు. పార్టీ జెండాను ఆవిష్కరించిన ఆయన గ్రామంలో గడపగడపకు తిరుగుతూ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా తెలుసుకున్నారు. గ్రామ చౌరస్తాలో ప్రజలనుద్దేశించి ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. అంతర్గత రోడ్లు, యూజీడీ పనులకు, వీధిదీపాల ఏర్పాటుకు నిధులు మంజూరు చేశామని గుర్తు చేశారు. ఎల్మినేడు విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి ప్రత్యేక ఫీడర్ లైన్ గ్రామానికి వేయించేందుకు, తుర్కగూడ నుంచి ఎర్రగుంట వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు.